సంక్షేమం, అభివృద్ధి వైపే ప్రజల మొగ్గు

- జగన్‌తోనే అవి సాధ్యమని నమ్ముతున్న ప్రజలు
- ప్రచారపర్వంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు
- ప్రజల మనిషిగా ఆయనకు గుర్తింపు


వాకలపూడిలో నిర్వహించిన ప్రచారంలో దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు (ఫైల్)

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోరులో ప్రచార పర్వం ముగింపు దశకు చేరుకుంది. సోమవారం జరగనున్న పోలింగ్ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేయగా అభ్యర్థుల ప్రచారం తారా స్థాయికి చేరింది. శనివారం సాయంత్రంతో ప్రచార గడువు ముగియనుండడంతో అభ్యర్థులు క్షణం తీరక లేకుండా ప్రచార పర్వంలో మునిగిపోయారు. కాకినాడ జిల్లాలో అత్యధిక ఓటర్లు గల కీలమైన నియోజకవర్గంగా కాకినాడ రూరల్ గుర్తింపు పొందింది. కాకినాడ సిటీ, గ్రామీణ ప్రాంత ఓటర్ల కలయికగా ఉన్న ఈ నియోజకవర్గంలో అదృష్టం పరీక్షించుకునేందుకు మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా పోటీ వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల మధ్యే నెలకొంది. కాకినాడ రూరల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కురసాల కన్నబాబు మరోసారి అదృష్టం పరీక్షించుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. పాత్రికేయ వృత్తి నుంచి బయటకు వచ్చి తొలిసారిగా 2009లో ప్రజారాజ్యంతో తరపున పోటీ చేసి విజయం సాధించిన కన్నబాబుకు కాకినాడ రూరల్ నియోజకవర్గం కంచుకోటగా మారింది. 2019లో వైఎస్సార్ సీపీ తరపున రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది, సీఎం జగన్ క్యాబినెట్‌లో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, తదితర కీలమైన శాఖలకు మంత్రిగా పనిచేశారు. చక్కని మాటతీరు, వాక్పటిమ, సౌమ్యంగా ఉండడం, నిరాడంబరత, కార్యకర్తల కోసం నిరంతర కష్ట జీవిగా ఉండే కన్నబాబు ఈసారి ఎన్నికల్లో బరిలో నిలిచి ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. గ్రామ గ్రామాన ఫ్యాన్ గాలి వీస్తుండడంతో ఉత్సాహంగా కన్నబాబు ముందుకు సాగుతున్నారు. కన్నబాబుకు సీఎం జగన్ ఐదేళ్ళ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కలిసొస్తున్నాయి. పేద కుటుంబాలకు డీబీటీ, నాన్ డీబీటీ కింద సుమారు రూ.3 వేల కోట్లు లబ్ధిచేకూరింది. సుమారు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో కన్నబాబుపై పేదలతో పాటు అన్ని వర్గాలు నమ్మకం పెట్టుకుని ఆయన గెలుపు కోసం శ్రమిస్తున్నారు. మరో వైపు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, పెద్ద ఎత్తున మహిళలు గ్రామాలలో కన్నబాబుకు మద్దతుగా జోరుగా ప్రచారం చేస్తున్నారు.

మొత్తం 15 మంది అభ్యర్థుల్లో కూటమి తరపున జనసేనకు కాకినాడ రూరల్ టిక్కెట్ ఇవ్వడంతో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) పోటీలో ఉన్నారు. ఆయన టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. కాంగ్రెస్, బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు ఎవరికి వారు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

సమర్థంగా ఎన్నికల విధులు


ఓపీవోల శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్
- ఓపీవో, ఎన్నికల సిబ్బంది శిక్షణ పరిశీలన

కాకినాడ రూరల్: పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన చేసుకుని సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జె.నివాస్ కోరారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఓపీవోలకు రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఓపీవోలు, ఇతర ఎన్నికల సిబ్బంది పోలింగ్ ప్రక్రియను ఎంత వరకు అవగాహన చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. 13న జరిగే పోలింగ్ ప్రక్రియ అంతా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఓపీఓలు పోలింగ్ విధులపై ప్రత్యేకంగా అవగాహన పొందాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఆర్వో ఇట్ల కిశోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

బోట్‌క్లబ్: నగరంలో ఓటు హక్కు ఉన్న ప్రతీ పౌరుడు ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకోవాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. నగరంలో గురువారం పలు ప్రాంతాల్లో ఆయన మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకుంటే ఇంటి వద్ద ఉండిపోకుండా నోటాకు ఓటు వేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కును గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

'బార్' ఎన్నికలకు రెండో రోజు 4 నామినేషన్లు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్‌కు 2024–25 సంవత్సరానికి ఈ నెల 17వ తేదీన జరిగే బార్ అసోసియేషన్ కార్యవర్గానికి గురువారం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు ఉపాధ్యక్ష పదవికి సుధిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పదవికి ఒబిలిశెట్టి సత్యనారాయణ, కమిటీ సభ్యులు యు.ఉమాగౌరి, బిందు శ్రీ వేమూరి నామినేషన్లు దాఖలు చేశారని, ఈ నామినేషన్లను శుక్రవారం పరిశీలిస్తామని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సీనియర్ న్యాయవాది టీపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు.

వేళంగిలో ఎన్నికల ప్రచారం

కరప: మండలం వేళంగిలో గురువారం జనసేన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ల గెలుపు కోరుతూ టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నాయకులు చుండ్రు వెంకన్నారావు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పందిరి రాట వేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి పదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 23 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఆలయ అర్చకులు బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవాలకు పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు మాట్లాడుతూ ఉత్సవాల్లో స్వామివారికి విశిష్ట సేవలు అందించేందుకు 15న భక్తులు గోవిందమాల దీక్షాధారణ చేస్తారన్నారు. ఆదేరోజు సాయంత్రం శ్రీవారి శోభాయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. 16న క్షీరాభిషేకంతో ఉత్సవ ఆరంభ స్నపనం, పల్లకీసేవ ఉంటుందన్నారు. 19న రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం, 20న లక్ష్మీనారాయణ వ్రతం, 23న మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగం నిర్వహిస్తారని వివరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామ ప్రజల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తా


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఎటువంటి సమస్యకైనా తోడుగా ఉంటా
- సొంతింటి కల సాకారం చేస్తా
- ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి
- దుమ్ములపేటలో అపూర్వ స్పందన


పెద్ద ఎత్తున హాజరైన మత్స్యకారులు

కాకినాడ: మత్స్యకార ప్రాంతం దుమ్ములపేటలో వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి గురువారం అనూహ్య స్పందన లభించింది. మొత్తం దుమ్ములపేట ప్రాంతమంతా కదిలి వచ్చి మీ వెంటే మేమంటూ ఆయనకు బాసటగా నిలిచారు. స్థానిక దుర్గగుడి ప్రధాన రహదారి వద్ద ద్వారంపూడి ప్రచారం నిర్వహించారు. అక్కడి మత్స్యకారుల నినాదాలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. తనను ఎంతో ఆదరించిన దుమ్ములపేట ప్రాంతాన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని వారి హర్షధ్వానాల మధ్య ద్వారంపూడి ప్రకటించారు. ఇక్కడి మత్స్యకారుల కోసం రైల్వే ట్రాక్ వద్ద మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. నెగ్గిన 18 నెలల వ్యవధిలో ప్రతి ఒక్కరి సొంతింటి కలను సాకారం చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగా వివాహమైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయించి, ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేయిస్తామన్నారు. అధికారంలో ఉండగా దుమ్ములపేటను దత్తత తీసుకున్న వనమాడి కొండబాబు ఆ ప్రాంతాన్ని ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. తాను ఎమ్మెల్యే అయ్యాక దాదాపు రూ.11 కోట్ల ఖర్చుతో ఆ ప్రాంతంలో సకల మౌలిక సదుపాయాలు కల్పించానని చెప్పారు. ముఖ్యంగా పీహెచ్‌సీని కూడా స్థానికంగా ఏర్పాటు చేశానన్నారు. టీడీపీ పాలనలో మత్స్యకారులు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా బందన హరి, ఎమ్మెల్సీగా పద్మశ్రీతో పాటు డిప్యూటీ మేయర్‌గా చోడిపల్లి ప్రసాద్‌లకు అవకాశం కల్పించిన విషయాన్ని అక్కడి మత్స్యకారులకు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, మత్స్యకార ప్రతినిధులు కాటాడి జానకిరామ్, కర్రి నారాయణ, వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు, ఎరుపల్లి సీతారామ్, పేర్ల దుర్గారావు, తిరిది సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సుస్థిర పాలన


జి.భావారంలో బ్యాలెట్ నమూనాతో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ, నాయకులు


తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: ప్రజా సంక్షేమంతో పాటు సుస్థిరపాలన కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కోరారు. మండలం జి.భావారంలో గురువారం స్థానిక నాయకులతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన అభివృద్ధి పనులు, సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పార్టీ నాయకులు రొక్కాల తారకేష్, తాతపూడి జీవన్‌బాబు, రేవు సత్యనారాయణ, గరగ సూరిబాబు, పలివెల చిన్న, కొప్పుల సతీష్ పాల్గొన్నారు. వాకాడలో సర్పంచ్ అడబాల సత్య, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, అడబాల ప్రసాద్, బుచ్చిబాబు, ఈశ్వరరావు, పెదకొత్తూరులో సర్పంచ్ చింతా నాగలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, యండమూరులో అనిచర్ల పార్వతి, రెడ్డి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు నురుకుర్తి వీరన్న, మార్రెళ్ల వెంకటరమణ, వనుం రమేష్, షేక్ దరియా, వేళంగిలో సర్పంచ్ సవిలే నీలిమ, నాయకులు సవిలే రాజేష్, జీలకర్ర దుర్గారావు, జల్దాని రాంబాబు, గుణ, సానా శ్రీను, వివిధగ్రామాల్లో వైఎస్సార్ శ్రేణులు ఎన్నికల ప్రచారంచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

వలసపాకలలో జెడ్పీటీసీ ప్రచారం

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, మహిళలతో ఆయన ఇంటింటికి పర్యటించిన జగన్‌ను సీఎం చేసేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో మత్స్యకారుల చేరిక

మండలంలోని సూర్యారావుపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సమక్షంలో పలువురు మత్స్యకారులు వైఎస్సార్ సీపీలో చేరారు. పేర్ల కామేశ్వరరావు, పి.రాజు, చవ్వాకుల పండు, రామలక్ష్మి, నాగమణి, పోసియ్య, లక్ష్మియ్య, తదితరులకు పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు.

భారీగా యాదవులు చేరిక

కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్‌కు చెందిన యాదవులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. యాదవ సంఘ నాయకులు నాగళ్ల లక్ష్మణరావు, కండల తిరుపతి రావు, రాంబాబు, ఫకుర్తి శ్రీనుచక్రం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సోదరుడు, సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ సమక్షంలో సుమారు వంద మంది చేరడంతో వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో ఫకుర్తి రాఘవ, ఐతే నూకరాజు, నాగళ్ల శివమణికంఠ, పల్లా సత్తెమ్మ, డేటా నాగసూరి, రత్నం, ఫకుర్తి చిలకమ్మ, శ్రీను, ఆనందరావు, సుబ్రహ్మణ్యం, గంగరాజు, మహేష్, కోలా స్వామి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కల్యాణ్‌కృష్ణ మాట్లాడుతూ కన్నబాబును గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాసురెడ్డి సూరిబాబు, గింజాల నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సూర్యారావుపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు


దర్శకుడు కల్యాణ్ కృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న యాదవ నాయకులు

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

కాకినాడ సిటీ: ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. గురువారం చేపట్టిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కాకినాడ రూరల్ మండలం తూరంగిలో అల్లూరి సీతారామరాజుకాలనీ, నాయీ బ్రాహ్మణకాలనీ, విముక్తికాలనీ, పగడాలపేట, శివకృష్ణకాలనీ, సత్యదుర్గానగర్, ఈశ్వర్ కాలనీ, రాజుల తూరంగి, వెలమల తూరంగి, సూర్యానగర్ ప్రాంతాల్లోను, కొవ్వూరు, తారకరామనగర్, కొవ్వూరు రోడ్డు, కాలువగట్టు తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తు మహిళలు, యువకులు పాల్గొని ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు బలగం ప్రసన్నకుమార్, దండుప్రోలు సత్యనారాయణ, వేపాడ శ్రీను, బొడ్డు సత్యనారాయణ, గరికిన అప్పన్న, గొల్లపల్లి బాబులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు కాపు సంఘాల ప్రతినిధులు పాల్గొని ఓటర్లను వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కురసాల కన్నబా బు, సునీల్‌కు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

పేదల పక్షపాతి జగనన్న

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు
- కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెంలో ప్రచారం


కొంగోడులో సినీ నటుడు గౌతంరాజుతో కలసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: కరోనా కష్టకాలంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా, శత్రువుల కూటమి అవమానకరంగా మాట్లాడుతూ విమర్శిస్తున్నా వాటికి ఎదురొడ్డి పేదల పక్షాన నిలబడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన చేశారని, అటువంటి పేదల ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపించి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. కరప మండలం కొంగోడులో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, సర్పంచ్ నక్కా అప్పలస్వామి, మాజీ సర్పంచ్ వనుం గంగరాజులు, పెద్దాపురప్పాడులో ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, విజయరాయుడుపాలెంలో సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, మండల జేఎస్‌వీ ఇన్‌చార్జి కాదా వెంకటేశ్వరరావు తదితరులు వెంటరాగా సినీనటుడు గౌతంరాజు, మండల నాయకులతో కల్సి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ చెప్పింది చెప్పినట్టుగా ప్రతీ పథకం అర్హులైన పేదలకు అందించి, వారికి నేనున్నానంటూ ధైర్యం నింపిన నాయకుడు జగనన్న అన్నారు. బీజేపీ, జనసేనలను వెంటబెట్టుకుని చంద్రబాబు ఎన్నికలు వచ్చే సమయానికి మళ్లీ మోసం చేయడానికి వస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకుల గురించి చెపుతూ పవన్‌కళ్యాణ్ లాగా ఊగిపోతూ, వాగడం రాదని, రూరల్‌నియోజకవర్గంలో జనసేన తరపున పోటీచేస్తున్న అభ్యర్థి లాగా పేకాటలు నిర్వహించడంరాదని ఆయన విమర్శించారు. తనకు తెలిసిందల్లా ప్రేమాభిమానాలతో పలకరించడం, పేదలకు అండగా నిలబడి, వారి అవసరాలు గుర్తించి అభివృద్ధి పనులు చేయడమేనన్నారు. చంద్రబాబు మాయచేసే పప్పుబెల్లాలు కావాలో జగన్ అమలుచేసే 32 సంక్షేమ పథకాలు కావాలో ఓటర్లే విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపి, సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేయాలని, అందుకు ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై రెండుసార్లు బటన్ నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్‌గుర్తు, బ్యాలట్ నమూనాతో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ కన్నబాబు ఎన్నికల ప్రచారం చేశారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సూర్యారావుపేటలో విస్తృత ప్రచారం


సూర్యారావుపేట మత్స్యకార గ్రామంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు

కాకినాడ రూరల్: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు విన్నవించుకున్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, వాలకపూడి ఫిషింగ్ హార్బర్‌పేట, పెనుమర్తి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. మత్స్యకారుల గ్రామం సూర్యారావుపేటతో పాటు ఫిషింగ్ హార్బర్ పేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో సూర్యారావుపేట సర్పంచ్ సూరాడ బేబీ, మత్స్యకార నాయకులు సూరాడ రాజు, సింహాచలం, సంగాడి మోషే, తదితరులు పాల్గొన్నారు.

'జయలక్ష్మి' బాధితులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



కాకినాడ: జయలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ వల్ల నష్టపోయిన ప్రతి బాధితునికి న్యాయం జరిగే వరకు అన్నివిధాలా అండగా ఉంటానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. బాధితుల తరఫున ప్రతినిధులు ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జయలక్ష్మి బ్యాంక్ ద్వారా దాదాపు రూ.500 కోట్ల మేర నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం అప్పట్లోనే తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎంతో మంది విశ్రాంత ఉద్యోగుల కష్టార్జితం, పింఛన్ సొమ్మును ఆ బ్యాంక్‌లో డిపాజిట్ చేశారని, అది మూతపడడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ఆ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల ఎస్పీలతో సిట్ ఏర్పాటు చేయించి డీఐజీ స్థాయి ఉన్నతాధికారితో విచారణ జరిపించి, నిర్వాహకులను అరెస్టు చేయించానన్నారు. ఆ మేరకు రూ.500 కోట్ల ఆస్తులకు సంబంధించి ఆస్తుల అటాచ్‌మెంట్ కూడా చేయించామన్నారు. సీఐడీ కోర్టు అనుమతి వచ్చిన వెంటనే బాధితులందరికీ న్యాయం జరిగేలా గట్టిగా పోరాడతానన్నారు. అలాగే ఎస్ఈజెడ్ భూములను వెనక్కి ఇచ్చిన నేపథ్యంలో సుమారు 18 ఎకరాల భూమి వచ్చే అవకాశం ఉందని, దీని ద్వారా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు అటాచ్‌మెంట్ ద్వారా న్యాయం జరగవచ్చునన్నారు. అందువల్ల బాధితులు ధైర్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జయలక్ష్మి బ్యాంక్ బాధితుల విషయంలో సీఎం జగన్, పార్టీ ప్రాంతీయ పరిశీలకులు మిథున్‌రెడ్డి, ఎంపీ వంగా గీత, తనతోపాటు రూరల్ ఎమ్మెల్యే కూడా అండగా నిలిచి భరోసాగా నిలిచామన్నారు.

ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్పులు ఇవ్వాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, హాజరైన బీఎల్‌వోలు, ఇతర అధికారులు

- ఆర్వో వెంకటరావు

కాకినాడ: ప్రతి ఒక్కరికీ ఓటరు సమాచార స్లిప్‌లు అందజేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 234 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే 98 శాతం పైగా ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తయ్యిందన్నారు. మిగిలిన వారికి కూడా శుక్రవారం సాయంత్రం లోపు నూరుశాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ సమాచార స్లిప్‌ల పంపిణీలో భాగంగా ఆయా నివాసాలకు వెళ్లినప్పుడు ఇళ్ల వద్ద ఓటర్లు అందుబాటులో లేకపోవడం, అడ్రస్‌లు మారడం, మరణించిన ఓటర్ల సమాచారాన్ని వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్న దొర, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.